# హో సరదా కథలు

పరంధామయ్య గారి వయసు అరవై ఏళ్ళకు పైన డెభ్భై ఏళ్ళకు లోపు ఉంటుంది ఉజ్జాయింపుగా. ఆయన మాత్రం తనకు అరవై ఎనిమిదేళ్ళని చెప్పుకుంటాడు ఖచ్చితంగా.

ఆయన అంత ఖచ్చితంగా చెప్పుకుంటుంటే మనం ఉజ్జాయింపుగా ఎందుకు అనుకోవాలన్న సందేహం కలగొచ్చు. కరక్టే... దానికుంది ఓ చిన్న తమాషా ఫ్లాష్ బ్యాక్

ఆయన హైస్కూల్ చదువుతున్న రోజుల్లో ఓ రోజు తన బర్త్ సర్టిఫికెట్ తారుమారు చేసేసి అందులో పుట్టినతేదీ పందొమ్మిది వందల ఇరవైనాలుగు సెప్టెంబర్ ఇరవై అని వేసేశాడని చెప్పుకుంటారు ఆయన సహవాసులు.

అలా చెయ్యడం వల్ల ఆయన అసలు వయసు పెరిగిందా, తరిగిందా అనే మీమాంసకు లోనుగాకండి. ఆ తేదీయే ఎందుకు వేశాడని అడగండి. మొత్తం అంతా తెలిసిపోతుంది.

## ఏ వయసుకి ఆ ముచ్చట

అవును...... ఆ తేదీ... నటసామ్రాట్, పద్మభూషణ్, దాదాసాహెబ్ అవార్డు గ్రహీత అక్కినేని నాగేశ్వరరావు పుట్టిన తేదీ...


అన్నట్టు చెప్పలేదుకదూ... పరంధామయ్య గారికి నాగేశ్వరరావు అంటే పంచప్రాణాలు. అందుకే ఆయన పుట్టిన రోజుని తన పుట్టినరోజుగా వేసేసుకున్నాడు. ఆయన చదువుకోలేదు కదాని తన బియ్యేడిగ్రీని ఫట్‌మనిపించేశాడు.

రోజురోజుకి ఆయనలోని ఆరాధన విపరీతం కాసాగింది. ఒకానొక దశలో, తనే నాగేశ్వరరావుననే ఫీలింగ్‌కి లోనయ్యేవాడు. "నేనే— అక్కినేని' అని అనుకునేవాడు.

రంగురంగుల షర్టులు, ఫాంటులు వేసేసుకుని, విగ్గు పెట్టేసుకుని, మేకప్ వేసేసుకుని, కూతుళ్ళు కొనుక్కున్న ఐబ్రో పెన్సిల్‌తో మీసాలు కనుబొమ్మలు దిద్దేసుకొని, రోడ్డు మీదికెళ్ళి 'హాయ్! నా పక్కన చోటున్నది ఒక్కరికే' అని పాడుతూ అమ్మాయిల వెంట పడేవాడు.

అప్పటికే పరంధామయ్య గారికి ఇద్దరు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలు, ముగ్గురు మనవలు. వాళ్ళంతా ఆయన ఈ వయసులో వేసే వేషాలకి సిగ్గుతో చచ్చిపోయేవారు. తల్లితో చెప్పుకొని బాధపడేవారు. ఆ మహా ఇల్లాలు మాత్రం పాపం ఏంచేస్తుంది— కన్నీరు పెట్టుకోవడం తప్ప!

ఇదిలా ఉండగా ఓ రోజున కొడుకులకే తెగ నామోషీ అనిపించి ఓ శుభముహూర్తాన పరంధామయ్య గారిని పిచ్చాసుపత్రిలో పడేశారు. అప్పటికే ఆయన "ఏయ్... ఏమిటిది... ఏమిటి?" అంటూ ఎంత గింజుకున్నా పట్టించుకోలేదెవ్వరూ.




రెండు నెలలు గడిచాయి. పరంధామయ్య గారు మేకప్ వేసుకోవడం మానేశారు. విగ్గు పెట్టుకోవడానికి ఒప్పుకోవటం లేదు. కళ్ళజోడు కంపల్సరీగా పెట్టుకుంటున్నారు. ఫాంట్లు, షర్టులు, బూట్లు మానేసి శుభ్రంగా పంచెలు కట్టుకుంటున్నారు. పాతికేళ్ళ వాడిలా ప్రవర్తించటం మానేసి అరవై డెభ్భై ఏళ్ళ వ్యక్తిలా నడుముకోవటం మొదలుపెట్టారు.

డాక్టర్లు మురిసిపోయారీ మార్పుకి. అతిత్వరలో డిశ్చార్జ్ చేస్తామని, ఈ లోగా తొందరపడి రావద్దని, వస్తే తిరగపెడితే మా పూచీ కాదని, చెప్పారు ఎందుకైనా మంచిదని.

అలా మరికొన్ని రోజులు అబ్జర్వేషన్‌లో ఉంచారు పరంధామయ్యగారిని. మనిషిలో వచ్చిన మార్పు కాస్త పర్మనెంట్‌గానే ఉన్నట్లనిపించింది డాక్టర్లకి.

ఒకరోజు............

"రేపే మిమ్మల్ని డిశ్చార్జ్ చెయ్యాలనుకుంటున్నాం. మీ వాళ్ళకి కబురు చెయ్యమంటారా? ముందుగా ఎవర్ని చూద్దాం అనుకుంటున్నారు?" అని అడిగారాయన్ని.

పరంధామయ్య గారు తల పైకెత్తారు. ఎడం కన్ను మీది కనుబొమ్మ కొద్దిగా మడిచి, కళ్ళజోడు సవరించుకున్నారు.

"...... డాక్టర్! ఎర్రకారులో అన్నపూర్ణని తీసుకురమ్మని వెంకట్‌కి ఫోన్ చెయ్యండి. నాగార్జునని డిస్టర్బ్ చెయ్యకండి. తన సినిమాల మీద ఏకాగ్రతని చెడనివ్వకండి

రాష్ట్రపతి పదవికి పోటీ చెయ్యమని రామారావు గార్ని వారి ఆత్మ ప్రబోధించిందా లేదా అన్న విషయం కనుక్కు చెప్పండి" అన్నారు ఎండ వేలి చూపుడు వేలు పైకి లేపి— (అరవై ఎనిమిదేళ్ళ అక్కినేనిలా)